శరవేగంగా రోడ్డు పనులు

తడ: చెన్నై–కోల్‌కతా జాతీయ రహదారి నుంచి చిన్న మాంబట్టు వరకు రోడ్డు పనులు శరవేగంగా సాగుతున్నాయి. కాదలూరు, వెండ్లూరుపాడు పంచాయతీల పరిధిలోని పలు గ్రామాలకు వెళ్లే ఈ రహదారి ఇటీవల కురిసిన వర్షాలకు పాడైపోయింది. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య రూ.55 లక్షలు మంజూరు చేయించారు. ఈ నిధులతో శరవేగంగా పనులు చేస్తున్నారు. ఈ పనులను ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మంగళవారం పరిశీలించారు.


రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కిలివేటి

బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరం

దక్కిలి: బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమని వెంకటగిరి ఐసీడీఎస్ సీడీపీఓ శంషాద్ బేగం అన్నారు. దక్కిలిలోని ఏపీ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ చిన్న వయస్సులో వివాహాలు చేయడంతో పిల్లలు ఎదుగుదల లేకుండా పోతుందన్నారు. బాల్య వివాహాలు నియంత్రించడంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది, మహిళా సంరక్షణ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఆడ పిల్లలును బాగా చదివించాలని, 18 ఏళ్లు నిండిన తరువాత వివాహాలు చేసుకోవాలని సూచించారు.

ఎన్నికల నిర్వహణకు సిద్ధం కండి

వెంకటగిరిరూరల్: అధికారులు ఎన్నికల నిర్వహణకు సిద్ధం కావాలని తహసీల్దార్ సాంబశివరావు సూచించారు. త్వరలో నిర్వహించనున్న ఎన్నికలకు సంబంధించి రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం ఆయన అధికారులు, రాజకీయ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ బూత్‌లు, ఓటర్ల జాబితాలను సిద్ధం చేసుకోవాలన్నారు. పోస్టల్ ఓట్లు, ఎన్నిక నియమావళిపై పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సంపూర్ణ ఆరోగ్యం

పెళ్లకూరు: జగనన్న ఆరోగ్య సురక్షతో అందరికీ సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఎంపీపీ శేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పుల్లూరు ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ముఖ్యఅతిథిగా పాల్గొని, ప్రసంగించారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పేదలకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందిస్తున్నారని చెప్పారు. వైద్యశిబిరానికి పుల్లూరు పరిసర గ్రామాల ప్రజలు విచ్చేసి, వైద్యపరీక్షలు చేయించుకుని, మందులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సీ శ్రీనివాసులురెడ్డి, ఏఓ అన్నపూర్ణరావు, డాక్టర్ సుజాత, కార్యదర్శి మధుమోహన్ తదితరులు పాల్గొన్నారు.

సురక్ష శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి

కోట: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ శంకరయ్య సూచించారు. మంగళవారం మండలంలోని తిన్నెలపూడి సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. డాక్టర్ నాగరాజు ఆధ్వర్యంలో వైద్యులు రోగులకు ఉచితంగా వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. 310 మందికి వివిధ రకాల వైద్యపరీక్షలు, మరో 37 కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సుధారెడ్డి, సురేంద్రరెడ్డి, సర్పంచ్ శ్రీదేవి, జగదీష్, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.


పెళ్లకూరు: కిట్ పంపిణీ చేస్తున్న ఎంపీపీ శేఖర్‌రెడ్డి

పాఠశాలల తనిఖీ

సూళ్లూరుపేట రూరల్: మండలంలోని శ్రీహరికోట, కుదరి ప్రాథమిక పాఠశాలలను రాష్ట్ర టీఏఆర్ఎల్ పరిశీలకుడు వినోద్ దీపక్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలోని విద్యార్థుల చదువు, స్కిల్స్‌ను పరీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఇంకా విద్యార్థులను మెరుగా తీర్చిదిద్దాలని సూచించారు. విద్యార్థులు సులువుగా అర్థ చేసుకునేలా బోధన ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీఏఆర్ఎల్ కోఆర్డినేటర్ సుధీర్ శర్మ, ఎంఈఓ–2 శ్రీనయ్య పాల్గొన్నారు.


నేడు బూత్ కన్వీనర్ల సమావేశం

గూడూరురూరల్: వైఎస్సార్ సీపీ బూత్ కన్వీనర్ల సమావేశం బుధవారం గూడూరులో జరుగుతుందని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ తెలిపారు.



















అందుబాటులో అత్యవసర ఉచిత సేవలు

చిల్లకూరు: అత్యవసరమైన సమయంలో ఎవరికి ఫోన్ చేయాలనే ఆలోచన చేయడం కష్టంగా ఉంటుంది. అయితే ఈ విషయంలో ప్రముఖ వ్యక్తులతో పాటుగా సంస్థలు దీనిపై అవగాహన కల్పించే నిమిత్తం సాక్షి దినపత్రికను వేదికగా మీ ముందుకు వస్తున్నాయి. ఇందులో వ్యవసాయం, పోలీస్, అత్యవసర వైద్య సేవలు, అత్యవసర గ్రామీణ వైద్యసేవలు, పాఠశాలలో భద్రత ప్రమాణాలు, మత్తుపదార్ధాల నిషేధం, విద్యుత్ సమస్యల పరిష్కారం, ఓటు హక్కుపై అవగాహన కల్పించేందుకు తదితర వాటికి అవసరమైన టోల్ ఫ్రీ నంబర్లను ప్రజలకు అందుబాటులోకి తెస్తున్నారు.


కే. శ్రీనివాసులు, తహసీల్దార్,చిల్లకూరు

వ్యవసాయంలో అనుమానాల నివృత్తికి టోల్ ఫ్రీ నంబర్	– 155251
పోలీసు సాయానికి టోల్ ఫ్రీ నంబర్	– 100
అత్యవసర వైద్య సేవలకు టోల్ ఫ్రీ నంబర్	– 108
అత్యవసర గ్రామీణ వైద్య సేవల టోల్ ఫ్రీ నంబర్	– 104
పాఠశాలలో భద్రతా ప్రమాణాలపై టోల్ ఫ్రీ నంబర్	– 14417
మత్తు పదార్థాలపై సమాచారం ఇచ్చేందుకు టోల్ ఫ్రీ నంబర్	– 14500
విద్యుత్ సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నంబర్	– 1912
ఓటు హక్కుపై అవగాహన, చేర్పులు, మార్పుల సమాచార నిమిత్తం టోల్ ఫ్రీ నంబర్	– 1950

ఆనందంగా ఉంది!

గూడూరురూరల్: అనాథ పిల్లలను ఆదుకోవడం ఎంతో ఆనందంగా ఉందని పంచాయతీరాజ్ డీఈ రవీంద్రకుమార్ అన్నారు. గూడూరులోని బాలసదనంలో మంగళవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ డీఈ రవీంద్రకుమార్ తన జన్మదినాన్ని పురస్కరించుకుని అనాథ పిల్లలతో కలసి జరుపుకున్నారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ షేక్ రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ డీఈ రవీంద్రకుమార్ ఇటీవల బాలసదనానికి గీజర్ అందజేశారన్నారు. వార్డెన్ కోరిక మేరకు చిన్నారులకు మంగళవారం దిండ్లు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ డిస్ట్రిక్ట్ చైర్మన్లు మురళీరెడ్డి, రామ్మోహన్, డీఈలు రామచంద్రయ్య, కృష్ణబాబు, సభ్యులు ఎంవీ రమణయ్య, శ్రీనివాసులు, ఇలియాజ్, రూపేష్‌రెడ్డి, రమణయ్య, అడ్వకేట్ రజనీకాంత్‌రెడ్డి, శివయ్య, వీరేంద్రనాథ్, తదితరులు పాల్గొన్నారు.


దిండ్లు అందజేస్తున్న డీఈ

శివాలయంలో క్షీరాధివాసం

చిల్లకూరు: తూర్పుకనుపూరులో జీర్ణోద్ధరణ చేసిన కామాక్షి సమేత మల్లికార్జున ఆలయంలో జరుగుతున్న కుంభాభిషేక మహోత్సవంలో భాగంగా మంగళవారం పలు పూజలు చేశారు. ఆలయ నిర్మాణ ప్రదాతలు సిద్ధారెడ్డి ఇంద్రసేనమ్మ, ఆమె కుటుంబ సభ్యులు వెంకట సుధీర్‌రెడ్డి, ప్రణతితోపాటు వారి కుమార్తె శ్రేష్ఠ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఉదయం మండప పూజ, హోమం, చతుర్వేద పారాయణం, క్షీరాధివాసం, శివనామ స్మరణలతో పండరి భజన చేశారు. ఈ కార్యక్రమాలను ఏఎంసీ మాజీ చైర్మన్ వై జానకిరామిరెడ్డి, ఆలయ ఈఓ నవీన్‌కుమార్ పర్యవేక్షించారు.


పాల్గొన్న దాత, కుటుంబ సభ్యులు













